సాక్షి బాపట్ల

సోమవారం ¡ 1 ¡ జనవరి ¡ 2024



ఎస్టీయూ క్యాలెండ్ ఆవిష్కరణ

గుంటూరు ఎడ్యుకేషన్:ఎస్టీయూ క్యాలెండర్, డైరీని నరసరావుపేట ఎంపీ లావు శ్రీకృష్ణ దేవరాయలు ఆదివారం రింగ్ రోడ్డులోని తన కార్యాలయంలో ఆవిష్కరించారు.



సాగర్‌లో పర్యాటకుల సందడి

విజయపురిసౌత్: నాగార్జునసాగర్, విజయపురిసౌత్‌లో ఆదివారం పర్యాటకుల సందడి నెలకొంది. రెండు తెలుగు రాష్ట్రాల ప్రజలు భారీగా తరలివచ్చారు.



తిరుపతమ్మకు బంగారు గాజులు

పెనుగంచిప్రోలు:తిరుపతమ్మవారికి ఆదివారం ఇబ్రహీంపట్నం మండలం గుంటుపల్లి గ్రామానికి చెందిన దంపతులు 12 గ్రాముల బంగారు గాజులను బహూకరించారు.

న్యూస్‌రీల్

పన్ను వసూళ్లలో గుంటూరుకు తొలిస్థానం

నెహ్రూ నగర్(గుంటూరు ఈస్ట్): 2023–24 రెండో అర్థ సంవత్సరానికి ఆస్తి, ఖాళీ స్థల పన్నుల వసూళ్లలో రాష్ట్రంలోనే గుంటూరు నగర పాలక సంస్థ మొదటి స్థానంలో నిలిచిందని నగర కమిషనర్ కీర్తి చేకూరి ఆదివారం తెలిపారు. వడ్డీ లేకుండా పన్ను చెల్లించేందుకు డిసెంబర్ 31వ తేదీ వరకు గడువు ఉండటంతో నగర ప్రజలు ఆదివారం ఒక్కరోజే రూ.1,26,06,701 చెల్లించారని చెప్పారు. రాష్ట్రంలో రెండో స్థానంలో రూ.67 లక్షలతో విజయవాడ నిలిచిందని పేర్కొన్నారు.

ఆంజనేయుని సన్నిధిలో హైకోర్టు జస్టిస్ జ్యోతిర్మయి



తెనాలిటౌన్: షరాఫ్‌బజార్‌లోని సువర్చలా సమేత పంచముఖ ఆంజనేయస్వామి ఆలయాన్ని ఆదివారం రాష్ట్ర హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ జ్యోతిర్మయి దంపతులు సందర్శించారు. దేవస్థానానికి విచ్చేసిన న్యాయమూర్తి దంపతులకు ఆలయ వంశపారంపర్య అర్చకులు రొంపిచర్ల శ్రీనివాసమూర్తి, వేద పండితులు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. ఆలయంలో న్యాయమూర్తి జ్యోతిర్మయి దంపతులు స్వామిని దర్శించుకుని పూజలు నిర్వహించారు. వీరితోపాటు తెనాలి ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి జి.రాజశేఖర్ ఉన్నారు. తొలుత ఆలయం చుట్టూ న్యాయమూర్తి దంపతులు ప్రదక్షిణలు చేశారు. మొక్కుబడులు సమర్పించుకున్నారు. అర్చకులు వారికి వేద ఆశీర్వచనం అందచేశారు. ఆలయ వ్యవస్థాపక కుటుంబ సభ్యులు ఎస్‌బీ శివ దంపతులు, ఆలయ కార్యనిర్వహణాధికారి అవుతు శ్రీనివాసరెడ్డి స్వామివారి జ్ఞాపికను వారికి అందజేశారు. శాలువాలతో సత్కరించారు. పంచముఖ ఆంజనేయస్వామి సంకీర్తన బృందం, సంకీర్తన సేవా సమితి సభ్యులు న్యాయమూర్తి దంపతులను సత్కరించారు. హనుమాన్ చాలీసా పారాయణం చేశారు. కార్యక్రమంలో ఆలయ అర్చకులు ఆర్.కిరణ్‌కుమార్, సురేష్, వైఖానస పండితులు ఎస్‌జీఎల్ రఘురామ్, వేదాంతం నాగమారుతీ, వన్‌టౌన్ సీఐ రాజశేఖర్, పలువురు న్యాయవాదులు, కోర్టు సిబ్బంది పాల్గొన్నారు.

పలు రైళ్ల దారి మళ్లింపు

లక్ష్మీపురం(గుంటూరు వెస్ట్): గుంటూరు రైల్వేడివిజన్ గుంటూరు–నంద్యాల స్టేషన్ల మధ్య డబ్లింగ్ పనులు జరుగుతున్న నేపథ్యంలో పలు రైళ్లను దారి మళ్లించినట్లు డివిజన్ సీనియర్ డీసీఎం దినేష్‌కుమార్ ఆదివారం వెల్లడించారు. రైలు నంబర్ 17215 మచిలీపట్నం–ధర్మవరం రైలు జనవరి 2 నుంచి 4 వరకు కృష్ణాకెనాల్, తెనాలి, రేణిగుంట, పాకాల, మదనపల్లి మీదుగా ప్రయాణిస్తుందని తెలిపారు. రైలు నంబర్ 17216 ధర్మవరం–మచిలీపట్నం రైలు జనవరి 3 నుంచి 5 వరకు మదనపల్లి, పాకాల, రేణిగుంట, తెనాలి, కృష్ణాకెనాల్ మీదుగా ప్రయాణిస్తుందని తెలిపారు. ప్రయాణికులు అసౌకర్యాన్ని గమనించాల్సిందిగాసూచించారు.

దీక్ష విరమణ ఏర్పాట్ల పరిశీలన



విజయవాడ : దీక్ష విరమణలకు వచ్చే భవానీలకు ఇబ్బంది కలగకుండా అన్ని ఏర్పాట్లు చేయాలని దుర్గగుడి చైర్మన్ కర్నాటి రాంబాబు, ఈవో కేఎస్ రామారావు సిబ్బందికి సూచించారు. శ్రీ దుర్గా మల్లేశ్వరస్వామి వార్ల దేవస్థానంలో జనవరి 3 నుంచి 7వ తేదీ వరకు జరిగే భవానీ దీక్ష విరమణలు పురస్కరించుకుని దేవస్థానం చేస్తున్న ఏర్పాట్లను ఆదివారం చైర్మన్, ఈవో పరిశీలించారు. మహా మండపం ఎదుట హోమగుండాలు, ఇరుముడులు సమర్పించే కౌంటర్లు, ప్రసాదాల కౌంటర్లు, తలనీలాలు సమర్పించే కేశఖండనశాలలో ఏర్పాట్లను పరిశీలించి ఇంజినీరింగ్ అధికారులకు పలు సూచనలు చేశారు. భవానీల రద్దీ అధికంగా ఉండే వీఎంసీ కార్యాలయం ఎదుట ఏర్పాటు చేస్తున్న హోల్డింగ్ పాయింట్లను పరిశీలించడంతో పాటు భవానీలకు తాగునీరు, ఇతర వసతులపై ఆరా తీశారు. అనంతరం సీతమ్మ వారి పాదాలు,ఇతర స్నాన ఘాట్లను పరిశీలించి షవర్లను తనిఖీ చేశారు. పర్యటనలో దేవస్థాన ఈఈ ఎల్.రమాదేవి, ఇతర ఇంజినీరింగ్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

సాగర్ నీటిమట్టం

విజయపురిసౌత్: నాగార్జునసాగర్ జలాశయ నీటిమట్టం ఆదివారం 522.90 అడుగుల వద్ద ఉంది. సాగర్ జలాశయం నుంచి ఎస్‌ఎల్‌బీసీకి 450 క్యూసెక్కులు విడుదలవుతోంది. శ్రీశైలం జలాశయ నీటిమట్టం 830.30 అడుగుల వద్ద ఉంది.



గుంటూరు నగరంలోని ఓ హాస్టల్లో జరిగిన వేడుకల్లో విద్యార్థినుల కేరింతలు

● 'జన'వరి జోష్

విరిసిన ఆశలే తోరణాలుగా.. పెదవులపై నర్తించిన నవ్వులే కోటి ఉషస్సులుగా.. ముంగిళ్లలో మెరిసిన రంగవల్లులే హరివిల్లులుగా.. మదిలో వికసించిన సంతోషాల సుమాలే కాంతిరేఖలుగా.. లోకమంతా సంబరమై మురిసింది. నవోదయానికి వెలుగుపూల బాటై సుస్వాగతం పలికింది. కొత్త వత్సరానికి ఆహ్వానమంటూ నినదించింది. ఉమ్మడి గుంటూరు జిల్లా వ్యాప్తంగా ఆనందోత్సాహాలు అంబరాన్నంటాయి. కేక్ కటింగ్స్‌తో ఆబాలగోపాలం కేరింతలు కొట్టారు.

\- సాక్షి ఫొటోగ్రాఫర్, గుంటూరు





గుంటూరు నార్త్ ప్యారిస్ చర్చిలో ప్రార్థనల్లో పాల్గొన్న క్రీస్తు భక్తులు

నవ్వులు కురిపించెన్

- రూ.2,750 నుంచి రూ.3 వేలకు పింఛన్ పెంపు
- జిల్లాలో 3,437 నూతన పింఛన్లు మంజూరు
- మూడో తేదీ నుంచి ప్రతి ఇంటికీ వెళ్లి అందించనున్న వలంటీర్లు
- ఆనందం వ్యక్తం చేస్తున్న లబ్ధిదారులు



పెన్షన్ అందుకుంటున్న దివ్యాంగుడు (ఫైల్)

బాపట్ల అర్బన్: అవ్వతాతల ముఖాల్లో ఆనందం కురవనుంది. మేనిఫెస్టోలో మనవడిగా ఆదుకుంటానని ఇచ్చిన మాటకు కట్టుబడి పింఛన్ రూ.3 వేలకు పెంచారు. ఇప్పటి వరకు ఠంచన్‌గా నెల ఒకటో తారీఖు సొమ్ము అందజేస్తున్నారు. పెంచిన సామాజిక పింఛన్‌ను జనవరి మూడో తేదీ నుంచి అందించనున్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డికి లబ్ధిదారులు జైజైలు పలుకుతున్నారు.

బాపట్ల జిల్లాలో పంపిణీ ఇలా..

జిల్లా వ్యాప్తంగా 2,37,273 పింఛన్ దారులకు రూ.70,00,81,500 నగదు పంపిణీ చేయనున్నారు. వీటిలో వృద్ధాప్య పింఛన్లు 1,293, వితంతువులు 1,147, వికలాంగ పింఛన్లు 987, ఒంటరి మహిళ పింఛన్లు 10 ఉన్నాయి. వీటికి పాటు కొత్తగా 3,437 నూతన పింఛన్లు మంజూరు చేశారు. జనవరి నుంచి జూలై వరకు నూతన పెన్షన్ల కోసం వలంటీర్ల ద్వారా సచివాలయాల్లో దరఖాస్తులు స్వీకరించారు. వీటిని వెల్ఫేర్ అసిస్టెంట్లు పరిశీలించి అర్హుల జాబితా రూపొందించారు. ఈ మేరకు జనవరి నెల నుంచి పంపిణీకి శ్రీకారం చుట్టనున్నారు.

లబ్ధిదారుడి ఇంటి వద్దకే..

ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి అధికారంలోకి వచ్చిన తరువాత గ్రామ సచివాలయ వ్యవస్థ ద్వారా ప్రజల వద్దకే పథకాలను తీసుకెళ్తున్నారు. కులమతాలకు అతీతంగా, పార్టీలు చూడకుండా అర్హతే ప్రామాణికంగా నవరత్నాలు అందిస్తున్నారు. ఈ క్రమంలో పెన్షన్లను ప్రతి నెలా ఒకటో తేదీన వేకువజామునే ఇంటింటికి వెళ్లి వలంటీర్ల అందజేస్తున్నారు.

చాలా ఆనందంగా ఉంది



మా ఇంటి వద్దకే వచ్చి వలంటీర్ దరఖాస్తు చేశాడు. నాకు పింఛన్ అర్హత ఉందో లేదో వాళ్లే తెలుసుకుని మరీ ఇంటికి వచ్చారు. అన్ని కాగితాలు సచివాలయం వాళ్లే చూసుకున్నారు. నీకు పింఛన్ వస్తుంది.. సీఎం మంజూరు చేస్తారని చెప్పారు. చాలా ఆనందం వేసింది. ఈ వయసులో మా లాంటోళ్లకు చేతి కర్రలా పింఛన్ ఉపయోగపడుతుంది. మాకు పెద్ద దిక్కు.

\- సంజీవ సింగల్ రెడ్డి, వెదుళ్లపల్లి, కొత్తపాలెం గ్రామం

ఆ బిడ్డకు రుణపడి ఉంటాం



వయసు మీద పడుతోంది. పనికి వెళదామంటే ఆరోగ్యం సహకరించడం లేదు. ఆరోగ్యం బాగోకపోయినా పనులు చేసుకుంటూ నెట్టుకొస్తున్నాం. మందులకే సరిపోవడం లేదు. ఒక్కో రోజు ఎసట్లోకి బియ్యం కూడా ఉండవు. ఇప్పుడు ఇంటి వద్దకే వచ్చి పింఛన్ పెట్టించారు. మాకు జగన్ బాబు పింఛన్ మంజూరు చేశాంట. చాలా సంతోషంగా ఉంది. ఆ బిడ్డకు రుణపడి ఉంటాం.

\- కె.లలితమ్మ, గోపాపురం, బాపట్ల మండలం

మార్గదర్శకాలకు అనుగుణంగా వెరిఫికేషన్



గ్రామ, వార్డు సచివాలయాలకు కొత్త పింఛన్ల సమాచారం వచ్చింది. వీటికి సంబంధించి మార్గదర్శకాలకు అనుగుణంగా వెరిఫికేషన్ ప్రక్రియను పూర్తి చేశాం. రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తాడేపల్లి క్యాంపు కార్యాలయం నుంచి వర్చువల్‌గా పింఛన్ల పంపిణీకి శ్రీకారం చుట్టనున్నారు.

\- బి.అర్జున్ కుమార్, డీఆర్డీఏ పీడీ, బాపట్ల జిల్లా

నేడు తెనాలికి అమృత్‌భారత్ ఎక్స్‌ప్రెస్



అమృత్ భారత్ సూపర్‌ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్



రైలు లోపలి సౌకర్యాలు

తెనాలి: సాధారణ ప్రయాణికుల కోసం తక్కువ ఖర్చుతో ఎక్కువ దూరం ప్రయాణించే సూపర్ ఫాస్ట్ రైళ్లను తీసుకురావాలన్న తలంపుతో భారత రైల్వేశాఖ కొత్తగా రెండు అమృత్‌భారత్ రైళ్లను ప్రవేశపెట్టింది. వీటిని భారత ప్రధాని నరేంద్రమోదీ శనివారం ప్రారంభించారు. ఈ రెండింటిలో ఒకటైన పశ్చిమ బెంగాల్‌లోని మాల్దా నుంచి ఎం.విశ్వేశ్వరయ్య టెర్మినస్ (బెంగళూరు) మధ్య నడిచే అమృత్ భారత్ ఎక్స్‌ప్రెస్ ఆంధ్రప్రదేశ్ నుంచి వెళుతుంది. మాల్దా నుంచి బయలుదేరిన ఎక్స్‌ప్రెస్ నూతన సంవత్సరం తొలిరోజైన సోమవారం ఉదయం 6.30 గంటలకు తెనాలి రైల్వేస్టేషన్‌కు చేరుకుంటుంది. రైలుకు ఘనస్వాగతం పలికేందుకు రైల్వే అధికారులు సన్నాహాలు చేస్తున్నారు. భారత రైల్వేశాఖ కొత్తగా ప్రవేశపెట్టిన హైస్పీడ్ రైళ్లలో మొదటిది వందేభారత్ ఎక్స్‌ప్రెస్. ప్రయాణికుల ఆదరణలో శరవేగంగా దూసుకుపోతోంది. ఖరీదైన సౌకర్యాలతో కూడిన ఈ రైలు ప్రయాణం వ్యయభరితమని తెలిసిందే. విజయవాడ–చెన్నై మధ్య నడుస్తున్న వందేభారత్ ఎక్స్‌ప్రెస్‌కు తెనాలి జంక్షన్‌లో స్టాపింగ్ కల్పించిన విషయం తెలిసిందే. జనవరి 24న ఇక్కడ వందేభారత్‌కు రైల్వే అధికారులు, వివిధ రాజకీయ పార్టీల నేతలు, ప్రయాణికులు ఘన స్వాగతం పలికారు. మళ్లీ ఇప్పుడు అమృత్ భారత్ ఎక్స్‌ప్రెస్‌కు స్వాగతం పలకనున్నారు. ఉపాధి అవకాశాల కోసం దూరప్రాంతాలకు వెళ్లే పేద, దిగువ మధ్యతరగతి వర్గాలకు మెరుగైన ప్రయాణ సౌకర్యాన్ని కల్పించటం అమృత్ భారత్ రైళ్ల లక్ష్యం. పుల్ పుష్‌బ్యాక్ టెక్నాలజీతో తయారుచేసిన ఈ రైలు గంటకు 130 కిలోమీటర్ల వేగంతో ప్రయాణిస్తుంది. ఆరెంజ్, గ్రే కలర్ స్కీముతో ఆకర్షించే డిజైనుతో చేశారు. మొత్తం 22 కోచ్‌లుంటాయి. రిజర్వు చేయని ప్రయాణికుల కోసం 8 సాధారణ 2వ తరగతి కోచ్‌లు, 12 సెకండ్ క్లాస్, 3–టైర్ స్లీపర్ కోచ్‌లు, రెండు గార్డు కంపార్టుమెంట్లు ఉన్నాయి. అన్ని కోచ్‌ల్లో ఆకర్షణీయమైన సీట్ లేఅవుట్‌లు, మెరుగైన లగేజి ర్యాక్‌లు, సీసీటీవీలు, ప్రతి బెర్త్ వద్ద మొబైల్ చార్జింగ్ పాయింట్లు, ఎల్‌ఈడీ లైట్లు, సమగ్ర ప్రజాసమాచార వ్యవస్థ వంటి మెరుగైన సౌకర్యాలను ఇందులో కల్పించారు. మన రాష్ట్రంలో విజయవాడ తర్వాత తెనాలి, చీరాల, ఒంగోలు, నెల్లూరు, గూడూరు, రేణిగుంట స్టాపింగ్‌లు ఉన్నాయి. రెగ్యులర్‌గా ఈనెల 7 నుంచి ఈ రైలు ప్రయాణిస్తుంది. రైలు నంబర్ 13434 మాల్దా–బెంగళూరు అమృత్‌భారత్ ఎక్స్‌ప్రెస్ ఆరోజు ఉదయం 8.50 గంటలకు మాల్దా నుంచి బయలుదేరుతుంది. మరుసటిరోజైన సోమవారం మధ్యాహ్నం 11.58 గంటలకు తెనాలి చేరుకుంటుంది. రైలు నంబర్ 13433 బెంగళూరు–మాల్దా రైలు ఈనెల 9న మధ్యాహ్నం 1.50కు బెంగళూరులో బయలుదేరి, 10వ తేదీ తెల్లవారుజామున 1.04 గంటలకు తెనాలి వస్తుంది.

కొత్త ఏడాదిలో సరికొత్తగా..

- పేదలకు చేరువగా మరిన్ని పథకాలు
- జనవరి నుంచి రూ.3 వేల చొప్పున పింఛన్ పెంపు
- ఆరోగ్య సురక్ష ఫేజ్–2 ప్రారంభం
- ఆరోగ్యశ్రీలో 4 లక్షల కొత్త కార్డులు పంపిణీ
- ఆడుదాం ఆంధ్రాతో క్రీడాభివృద్ధి
- ఉపాధితో వ్యవసాయానికి ఆసరా
- జిల్లావాసులకు నూతన సంవత్సర శుభాకాంక్షలు
- 'సాక్షి'తో కలెక్టర్ రంజిత్‌బాషా



సాక్షి ప్రతినిధి, బాపట్ల: కొత్త ఏడాదిలో ప్రభుత్వం పేదలకు మరింత చేరువగా వెళ్లేందుకు పెద్ద ఎత్తున సంక్షేమం చేపడుతోంది. పింఛన్ పెంపుదలతో పాటు అనేక పథకాలు అమలు ప్రతిష్టాత్మకంగా చేపట్టనున్నారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ పథకాలు అందాలన్నదే ప్రభుత్వ ఉద్దేశం అధికార యంత్రాగం పనిచేస్తోంది. ఈ నేపథ్యంలో కలెక్టర్ రంజిత్‌బాషా ఆదివారం 'సాక్షి'తో మాట్లాడారు.

అవ్వతాతలకు రూ.3 వేలు పింఛన్..

అవ్వతాతల పింఛన్‌ను జనవరి నుంచి రూ.3 వేలకు పెంచి ఇస్తున్నట్లు చెప్పారు. ఇది వారికి మరింత మేలు చేయనుందని పేర్కొన్నారు. ఆరోగ్యశ్రీ పరిమితిని రూ.25 లక్షలు పెంచడంతో ప్రజలకు వైద్యం అందలేదనే సమస్య ఉండకూడదనే ఉద్దేశంతో చర్యలు చేపట్టినట్లు వివరించారు. జిల్లాలోని ఆరోగ్యశ్రీ అర్హులకు 4 లక్షల కొత్త కార్డులను పంపిణీ చేస్తున్నామని వెల్లడించారు. దీనివల్ల పేదలకు ఆరోగ్య భరోసా లభిస్తుందన్నారు.

ఆరోగ్య సురక్షతో..

ఆరోగ్య సురక్ష కార్యక్రమం ఫేజ్–2 జనవరిలోనే ప్రారంభించనున్నట్లు కలెక్టర్ వివరించారు. మొదటి దశలో ఇంటింటికి వెళ్లి ఆరోగ్య సమస్యలను గుర్తించడంతో పాటు వైద్యశాలలో వైద్యం అందించేందుకు చర్యలు చేపట్టినట్లు పేర్కొన్నారు. గ్రామీణ క్రీడాకారులను వెలికితీసేందుకు ఆడుదాం ఆంధ్రా పేరుతో క్రీడా పోటీలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. దీని వలన గ్రామీణ యువతలో దేహదారుఢ్యం పెంపొందడమే కాక మానసిక స్థైర్యం సమకూరుతుందన్నారు. జిల్లాలో చాలా మంది క్రీడాకారులు ఉన్నట్లు తెలిపారు. వారిని ఆదర్శంగా తీసుకుని యువత క్రీడల్లో రాణించాలని పిలుపునిచ్చారు. ఔత్సాహిక క్రీడాకారులకు ప్రభుత్వం అన్ని విధాలా సహకారం అందిస్తోందని పేర్కొన్నారు.

అందరికి చేయూత...

ఆసరా, చేయూత పథకాలను కొత్త ఏడాదిలో పెద్ద ఎత్తున అమలు చేస్తున్నామని కలెక్టర్ రంజిత్‌బాషా వివరించారు. ఉపాధి హామీ పథకం ద్వారా వ్యవసాయాభివృద్ధికి చర్యలు చేపడుతున్నట్లు చెప్పారు. పాత చెరువుల ఆధునికీకరణ , వేలాది కొత్త చెరువుల నిర్మాణం, కాలువల ఆధునికీకరణ, మొక్కల పెంపకంతో పాటు పలు కార్యక్రమాలను నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. తద్వారా కూలీలకు పెద్ద ఎత్తున పనులు కల్పించనున్నట్లు తెలిపారు.

పర్యాటకానికి ఊతం..

పర్యాటక అభివృద్ధికి చిత్తశుద్ధితో పనిచేస్తున్నట్లు చెప్పారు. తీరప్రాంతంలో పెద్ద ఎత్తున రోడ్ల నిర్మాణానికి చర్యలు తీసుకున్నట్లు వివరించారు. రిసార్ట్‌ల ఏర్పాటుకు అడుగులు వేస్తున్నట్లు వెల్లడించారు. చీరాల– వాడరేవు నుంచి చిలకలూరిపేట వరకు నాలుగులైన్ల హైవే నిర్మాణం జరుగుతుందని వెల్లడించారు. ఇందుకోసం భూసేకరణ వేగంగా జరుగుతున్నట్లు చెప్పారు.

పేదల సొంతింటి కల..

పేదల గృహ నిర్మాణ పథకాన్ని వేగవంతం చేసి అర్హులకు పక్కాగృహాలను నిర్మిస్తున్నట్లు కలెక్టర్ రంజిత్‌బాషా తెలిపారు. ఇప్పటికే జగనన్న కాలనీలు ఏర్పాటు చేసి మౌలిక వసతులు కల్పించినట్లు చెప్పారు. నిర్మాణాలు శరవేగంగా సాగుతున్నట్లు పేర్కొన్నారు. ఇప్పటికే ఇళ్ల నిర్మాణం పూర్తి చేసుకున్న పేదలు గృహ ప్రవేశాలు చేస్తున్నట్లు తెలిపారు. మిగిలిన ఇళ్లను పూర్తి చేసుకునే విధంగా లబ్ధిదారులకు అవగాహన కల్పిస్తున్నట్లు వివరించారు.

రైతులను ఆదుకునేందుకు..

మిచాంగ్ తుఫాన్ కారణంగా పంట దెబ్బతిన్న రైతులను ప్రభుత్వం ఆదుకుంటుందని కలెక్టర్ స్పష్టం చేశారు. ఇప్పటికే క్షేత్రస్థాయిలో సర్వే నిర్వహించగా పరిహారం జాబితాను ప్రభుత్వానికి నివేదించినట్లు వివరించారు. త్వరలో నష్టపరిహారం విడుదలకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని చెప్పారు.

పారదర్శకంగా ఓటరు నమోదు...

ఓటరు నమోదు ప్రక్రియ పారదర్శంగా చేస్తున్నట్లు కలెక్టర్ రంజిత్‌బాషా వివరించారు. ఎన్నికల ఏడాది కావడంతో ఓట్ల నమోదు ప్రక్రియతో పాటు పోలింగ్ బూతుల ఏర్పాటు, బ్యాలెట్ బాక్సులు సిద్ధం చేయడం, ఎన్నికలపై రాజకీయ పార్టీలు, ప్రజలకు అవగాహన కల్పించడం తదితర కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. జిల్లాలో ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో జరిగేందుకు అన్ని చర్యలు తీసుకుంటున్నట్లు కలెక్టర్ చెప్పారు. పోలింగ్ శాతాన్ని పెంచేలా ప్రజలను చైతన్య వంతులను చేస్తున్నామని తెలిపారు. కొత్త ఏడాదిలో ప్రజలు సుఖశాంతులతో ఉండాలని, ప్రశాంతంగా న్యూ ఇయర్ వేడుకలు చేసుకోవాలని కలెక్టర్ ఆకాంక్షించారు.

క్లుప్తంగా

నూతన సంవత్సర శుభాకాంక్షలు: మంత్రి మేరుగ



భట్టిప్రోలు: ప్రజలకు రాష్ట్ర సాంఘిక, సంక్షేమ శాఖ మంత్రి మేరుగ నాగార్జున నూతన సంవత్సర శుభాకాంక్షలు అందజేశారు. నూతన సంవత్సరంలో అందరి జీవితాల్లో వెలుగులు నిండాలని ఆకాంక్షించారు. ప్రజలందరూ సంతోషంగా వేడుకలు జరుపుకోవాలని కోరారు.

మంత్రి రజిని నూతన సంవత్సరం శుభాకాంక్షలు



పట్నంబజారు: నూతన సంవత్సరం పురస్కరించుకుని ప్రజలందరికీ రాష్ట్ర వైద్య, ఆరోగ్యశాఖ మంత్రి విడదల రజిని శుభాకాంక్షలు తెలిపారు. ప్రతి ఇంట సంక్షేమ కాంతులు విరబూయాలని, ఆనందోత్సాహాలతో ప్రతి కుటుంబం సంతోషాల నడుమ జీవించాలని ఆకాంక్షించారు. రాష్ట్రాన్ని సంక్షేమ పథంలో ముందుకు తీసుకుని వెళ్తున్న రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చేస్తున్న ప్రతి మంచి పనికి ఆ భగవంతుడి ఆశీస్సులు ఉండాలని ఆకాంక్షించారు.

మంత్రి అంబటి నూతన సంవత్సర శుభాకాంక్షలు



సత్తెనపల్లి: రాష్ట్ర ప్రజలకు జలవనరుల శాఖా మంత్రి అంబటి రాంబాబు ఆదివారం నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. కొత్త సంవత్సరంలో ప్రతి ఒక్కరూ నూతన లక్ష్యాలను ఏర్పాటు చేసుకొని లక్ష్యసాధన కోసం కృషి చేయాలని సూచించారు. కొత్త సంవత్సరంలో అందరికి మంచి జరగాలని ఆకాంక్షించారు.

నూతన సంవత్సర శుభాకాంక్షలు: ఎంపీ మోపిదేవి



రేపల్లె రూరల్: ప్రజలకు ఎంపీ మోపిదేవి వెంకట రమణారావు ఆదివారం 2024 నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. ప్రజలు సుఖశాంతులు, పాడి, పంటలతో వర్ధిల్లాలని ఆకాంక్షించారు. కొత్త ఆశలతో ప్రతి ఒక్కరి జీవితాలు ఆనందాలు కురియాలని చెప్పారు.

జెడ్పీ చైర్‌పర్సన్ నూతన సంవత్సర శుభాకాంక్షలు



గుంటూరు ఎడ్యుకేషన్: ఉమ్మడి గుంటూరు జిల్లా ప్రజలు, ప్రజా ప్రతినిధులతో పాటు అధికార యంత్రాగానికి జెడ్పీ చైర్‌పర్సన్ కత్తెర హెనీ క్రిస్టినా సురేష్‌కుమార్ నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. నూతన సంవత్సరం ప్రజలందరి జీవితాల్లో నూతన ఆనందాలు, సంతోషాలను తీసుకురావాలని కోరుకుంటూ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పరిపాలనలో అన్నివర్గాల ప్రజలందరు సుభిక్షంగా ఉండాలని ఆకాంక్షించారు. ఇంటి ముంగిటకే విస్తృతమైన సంక్షేమ పథకాలను తెచ్చిన జగనన్న ప్రభుత్వం పేద, బడుగు, బలహీనవర్గాల కుటుంబాల్లో వెలుగులు నింపిందని అన్నారు.

ఆర్బీకేల్లో కందుల కొనుగోలు కేంద్రాలు

శావల్యాపురం: జిల్లాలో ప్రభుత్వ నిబంధనల మేరకు అన్ని రైతు భరోసా కేంద్రాల్లో కందుల కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు జాయింట్ కలెక్టరు ఎ.శ్యాంప్రసాదు వెల్లడించారు. ఆదివారం మండల కేంద్రం శావల్యాపురంలో తహసీల్దారు పదవీ విరమణ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు.

చేనేతల సంక్షేమానికి ప్రభుత్వం కృషి

ఎమ్మెల్యే కరణం బాలరాం



చేనేత సొసైటీలో వస్త్రాలు కొనుగోలు చేస్తున్న ఎమ్మెల్యే బలరాం

చీరాల: వ్యవసాయ రంగం తర్వాత పెద్ద రంగమైన చేనేతరంగానికి చేయూతనిచ్చి చేనేతలకు పూర్వ వైభవం తీసుకువచ్చేందుకు సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రత్యేకంగా కృషి చేశారని ఎమ్మెల్యే కరణం బలరామకృష్ణమూర్తి అన్నారు. ఆదివారం మండలంలోని దేవాంగపురి పంచాయతీలోని అయోధ్య నగర్‌లో 'ది శుభోదయం చేనేత పారిశ్రామికుల సహకార ఉత్పత్తి విక్రయ' సంఘం నూతన భవనాన్ని ప్రారంభించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ.. నియోజకవర్గంలో చేనేతలకు ప్రభుత్వం ప్రోత్సాహకాన్ని అందించిందన్నారు. చేనేతల కార్మికులకు, చేనేతరంగం అభివృద్ధికి సీఎం జగన్ ఎనలేని కృషి చేశారన్నారు. చేనేత ఉత్పత్తుల కొనుగోళ్లకు చేయూతనందించారని కోరారు. ప్రభుత్వం సహకారాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. అనంతరం చేనేత వస్త్రాలను ఎమ్మెల్యే కొనుగోలు చేశారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ జంజనం శ్రీనివాసరావు, చేనేత జౌళి శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ ఉదయ్ కుమార్, మాచర్ల మోహనరావు, మేడా వెంకటరావు, బి.హేమంత్‌కుమార్, డి.వీరనాగేశ్వరరావు, బాలసుబ్రహ్మణ్యం, పుణ్యవతి, కుమార్, సరస్వతి ఉన్నారు.

హత్య కేసులో నిందితుల అరెస్ట్



వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ జనార్ధనరావు, పక్కన సీఐ శ్రీనివాసరెడ్డి

మహిళ సహా తొమ్మిది మందిని అరెస్ట్ చేసిన పోలీసులు

తెనాలిరూరల్: భర్త హత్యకు దారి తీసిన దంపతుల గొడవ ఘటనపై కేసు నమోదవగా, తొమ్మిది మంది నిందితులను పోలీసులు అరెస్ట్ చేశారు. స్థానిక కొత్తపేటలోని రూరల్ పోలీస్‌స్టేషన్‌లో ఆదివారం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో డీఎస్పీ బి.జనార్ధనరావు వివరాలు తెలిపారు. కఠెవరం గ్రామ ఎస్సీ కాలనీకి చెందిన మృతుడు గేరా వాసు పెయింట్ పనిచేస్తూ జీవనం సాగించేవాడు. గ్రామానికి చెందిన బత్తుల అబ్రహాం కూతురు వెన్నలను నాలుగేళ్ల క్రితం ప్రేమ వివాహం చేసుకున్నాడు. వాసు తల్లి అనారోగ్యానికి గురవడంతో ఆమెకు సంబంధించిన పనులన్నీ వెన్నలే చేస్తోంది. ఈ క్రమంలో 25వ తేదీన వెన్నల తండ్రి అబ్రహాం, బాబాయి కలిసి ఆమె ఇంటికి వచ్చారు. అక్కడ కూతురు వెట్టి చాకిరీ చేస్తుందని చూసి అల్లుడు వాసుని ప్రశ్నించడంతో ఇరువురి మధ్య ఘర్షణ జరిగింది. అక్కడి నుంచి వెళ్లిపోయిన వారు తమ కూతురు పడుతున్న బాధల గురించి గ్రామంలోనే ఉంటున్న తన అక్క తోకల మేరీకి అబ్రహాం, అతని తమ్ముడు చెప్పుకుని బాధపడ్డారు. అనంతరం మేరీ తన భర్త, ఇద్దరు కొడుకులను తీసుకుని వాసు ఇంటికి వెళ్లి ఘర్షణకు దిగి అంతా కలిసి వాసుపై దాడి చేశారు. వాసుతో పాటు అతడి తమ్ముడు గోపి, మేనమామ తిరుపతిరావులపై కూడా దాడికి దిగారు. ఇదే సమయంలో పాత కక్షలు మనసులో పెట్టుకున్న వెన్నెల బావ అయిన తోకల అరవింద్ తన స్నేహితులు మాతంగి ప్రకాష్, గోళ్ల జయంత్, కంచర్ల ప్రవీణ్, కోట రవికుమార్‌లతో కలిసి అక్కడకు చేరుకుని వాసుపై విచక్షణారహితంగా దాడి చేశారు. కత్తులు, గొడ్డలి, స్క్రూ డ్రైవర్‌తో వాసుపై దాడి చేయడంతో తీవ్రంగా గాయపడగా బంధువులు ప్రభుత్వాస్పత్రికి తీసుకు వెళుతుండగానే అతడు మృతి చెందాడు. దీనిపై వాసు మేనమామ తిరుపతిరావు ఇచ్చిన ఫిర్యాదు మేరకు రూరల్ ఎస్ఐ సీహెచ్ వెంకటేశ్వర్లు కేసు నమోదు చేయగా సీఐ కె.శ్రీనివాసరెడ్డి దర్యాప్తు చేపట్టారు. కేసులో నిందితులుగా ఉన్న మొత్తం తొమ్మిది మందిని అదుపులోకి తీసుకుని అరెస్ట్ చేశారు. వీరివద్ద రెండు మోటార్ బైక్‌లు, రెండు కత్తులు, గొడ్డలి, స్క్రూ డ్రైవర్‌ను స్వాధీనం చేసుకున్నామని, నిందితులను కోర్టులో హాజరుపరుస్తున్నట్లు డీఎస్పీ జనార్ధనరావు తెలిపారు. సమావేశంలో సీఐ శ్రీనివాసరెడ్డి, ఎస్ఐలు వెంకటేశ్వర్లు, ప్రసన్నకుమార్, సిబ్బంది ఉన్నారు.

దోపిడీ ఘటనల్లో ముగ్గురు నిందితులు..



వివరాలు వెల్లడిస్తున్న ఎస్ఐ భాగ్యరాజు

గుంటూరు ఈస్ట్: రెండు వేర్వేరు దోపిడీ ఘటనల్లో ముగ్గురు నిందితులను అరండల్‌పేట పోలీసులు అరెస్ట్ చేశారు. పోలీసుస్టేషన్‌లో ఆదివారం ఎస్ఐ భాగ్యరాజు మీడియాకు వివరించారు. శ్రీనగర్ 8వ లైన్‌లో నివాసించే శ్రీదేవి దేవి శారీస్ రెడీమెడ్ డ్రెస్సెస్ పేరితో ఇంటి ముందు షాపు నిర్వహిస్తున్నారు. ఈక్రమంలో ఈ నెల 8వ తేదీ ఇద్దరు యువకులు షాపునకు వచ్చి దుస్తులు కొనుగోలు చేసి డబ్బులు చెల్లించారు. శ్రీదేవి చిల్లర ఇవ్వడం కోసం ఇంట్లోకి వెళ్లగా ఇద్దరు యువకులు లోపలికి వెళ్లి ఆమెను కొట్టి బెదిరించి ఆమె నుంచి రూ.1,20,000 లాక్కొని పరారయ్యారు.

- మరో ఘటనలో శ్రీనగర్ ఏడో లైన్‌లో ఉంటున్న విశ్రాంత ఉద్యోగిని ఆనందబాల ఇంటి ముందు టూలెట్ బోర్డు తగిలించింది. ఈ నెల 22వ తేదీ ఇద్దరు యువకులు, ఒక మహిళ ఇంట్లోకి వచ్చి అద్దె ఇల్లు చూపించాలని ఆనంద బాలను కోరారు. ఆనంద బాల వారికి ఇల్లు చూపిస్తున్న క్రమంలో ముగ్గురు ఆమెపై దాడి చేశారు. ఈక్రమంలో బాధితురాలి మెడలోని రెండు బంగారు గొలుసులు, రెండు బంగారు గాజులు, మూడు ఉంగరాలు, ఒక సెల్‌ఫోన్ లాక్కొని అక్కడి నుంచి పరారయ్యారు. ఈ ఘటనలపై కేసులు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేశారు. నిందితులైన పిడుగురాళ్లకు చెందిన కుంచపు దుర్గాప్రసాద్, గుంటూరు రాజీవ్ గాంధీనగర్‌కు చెందిన బత్తుల అశోక్‌కుమార్, మున్నంగి ప్రియాంకలను ఆదివారం అరెస్ట్ చేశారు. కోర్టులో హాజరుపరచి రిమాండ్‌కు తరలించారు. నిందితుల వద్ద నుంచి రూ.10వేల నగదు, బంగారు ఆభరణాలు మొత్తం స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ భాగ్యరాజు చెప్పారు.

దుర్గాపురంలో నర్సింగ్ విద్యార్థినులకు అస్వస్థత

లబ్బీపేట(విజయవాడతూర్పు): విజయవాడ దుర్గాపురంలోని విజయ నర్సింగ్ స్కూల్ విద్యార్థినులు 28 మంది అస్వస్థతకు గురయ్యారు. ఆదివారం ఉదయం అల్పాహారం తీసుకున్న తర్వాత వాంతులు, విరేచనాల బారిన పడ్డారు. వారిలో ఏడుగురిని చికిత్స నిమిత్తం సెయింట్ ఆన్స్ (అమెరికన్ ఆస్పత్రి)కి, మరో 21 మందిని కొత్త ప్రభుత్వాస్పత్రికి తరలించారు. ఈ విషయం తెలుసుకున్న జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ మాచర్ల సుహాసిని ఎపిడిమిక్ బృందంతో నర్సింగ్ స్కూల్‌ను సందర్శించారు. అక్కడ విద్యార్థినులు తిన్న ఆహారాన్ని పరిశీలించారు. ఆ శాంపిల్‌ను సేకరించారు. ఫుడ్ సేఫ్టీ అధికారులకు సమాచారం ఇచ్చారు. ఈ సందర్భంగా నర్సింగ్ స్కూల్ అధినేత టి.అర్జునరావు నుంచి వివరాలు సేకరించారు. అనంతరం ప్రభుత్వాస్పత్రికి వెళ్లి చికిత్స పొందుతున్న విద్యార్థినుల ఆరోగ్య పరిస్థితిపై ఆరాతీశారు. వారికి వైద్యం చేస్తున్న డాక్టర్ దుర్గాప్రసాద్‌ను అడిగి వివరాలు తెలుసుకున్నారు.

ఆకట్టుకున్న సాంఘిక పద్యనాటకం



తెనాలి: హైదరాబాద్‌కు చెందిన ప్రముఖ నాటక రచయిత ఎం.అంబదాస్ రచించి, దర్శకత్వం వహించిన 'అమృతము వద్దు...ఆ మృతమూ వద్దు...అనే నాటకాన్ని కళల కాణాచి ఆధ్వర్యంలో ప్రదర్శించారు. రెండు తెలుగు రాష్ట్రాలకు చెందిన నాటక రచయితలతో పట్టణంలోని తెనాలి రామకృష్ణకవి కళాక్షేత్రంలో శనివారం ఒకరోజు సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్వహించిన సాంఘిక పద్యనాటకం ఆకట్టుకుంది. సదస్సు అనంతరం సమకాలీన సాంఘిక పద్యనాటకాన్ని తెనాలి ప్రేక్షకులకు ప్రదర్శించి చూపారు. ప్రకృతి వినాశనానికి పాల్పడితే భవిష్యత్ అగమ్యగోచరమని హెచ్చరించిందీ నాటకం. దాదాపు రెండున్నర గంటల వ్యవధి కలిగిన ఈ నాటకంలో 52 పద్యాలు, ముచ్చటగా మూడు పాటలు కథానుగుణంగా సాగాయి. మొత్తం 19 మంది నటీనటులు ఇందులో పాత్రోచితంగా నటించారు. ఈ సందర్భంగా ఒక్కో నాటక రచయితకు రూ.25 వేల పారితోషికం ఇస్తామని కళల కాణాచి వ్యవస్థాపకుడు, ప్రముఖ సినీరచయిత డాక్టర్ సాయిమాధవ్ బుర్రా ప్రకటించారు. దీనికి ముందు శ్రీసాయి ఆర్ట్స్, కొలకలూరు సమాజం 'కౌసల్యా సుప్రజా రామా' నాటికను ప్రదర్శించారు. ఆకెళ్ల శివప్రసాద్ మూలకథను శ్రీస్నిగ్ధ నాటకీకరరించారు. గోపరాజు విజయ్ దర్శకత్వంలో ఈ నాటికను ప్రదర్శించారు. తొలుత నాటక ప్రదర్శనలకు ముందు ప్రముఖ రంగస్థల కళాకారిణి బుర్రా జయలక్ష్మి జ్యోతిప్రజ్వలన చేశారు. డాక్టర్ సాయిమాధవ్ బుర్రా, డాక్టర్ వరప్రసాద్, డాక్టర్ ఎ.మల్లేశ్వరరావు, సీహెచ్ సింగారావు, కె.రమేష్, డి.భవాని పర్యవేక్షించారు.

చిత్రకారుడు 'బొండా'కు అవార్డులు

భవానీపురం(విజయవాడపశ్చిమ): ప్రముఖ చిత్రకారుడు డాక్టర్ బొండా జగన్‌మోహన్‌రావుకు రెండు ప్రతిష్టాత్మక అవార్డులు లభించాయి. అయోధ్యకు చెందిన స్వదేశ్ సంస్థాన్ భారత్ ఆధ్వర్యంలో అయోధ్య కళా సంస్కృతి మహా కుంభ్ సంస్థ ఇటీవల నిర్వహించిన చిత్రకళ పోటీల్లో ప్రతిష్టాత్మక స్వదేశ్ భారత్ గౌరవ్ సమ్మాన్-2923, స్వదేశ్ నవరత్న అచీవర్స్ అవార్డ్-2023 దక్కాయి. భవానీపురం హౌసింగ్‌బోర్డ్‌కాలనీకి చెందిన జగన్‌మోహన్‌రావు గిరిజనుల జీవనశైలిపై అనేక చిత్రాలను చిత్రీకరించి పలు జాతీయ, అంతర్జాతీయ అవార్డులు అందుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శ్రీరామ మందిరం ప్రారంభోత్సవాన్ని పురస్కరించుకుని అయోధ్య కళా సంస్కృతి మహాకుంభ్ సంస్థ నిర్వహించిన పోటీల్లో తన పెయింటింగ్‌లకు రెండు అవార్డ్స్ దక్కడం ఎంతో సంతోషంగా ఉందన్నారు. తనకు దాదాపు 30 వరకు జాతీయ, అంతర్జాతీయ అవార్డ్స్ లభించాయన్నారు. పోస్ట్ ద్వారా ఈ అవార్డులను అందుకున్న ఆయన్ని పలువురు చిత్రకారులు, నగర ప్రముఖులు అభినందించారు.

పెండింగ్ బకాయిలు విడుదల చేయాలి

ఏపీటీఎఫ్ నాయకుడు వరప్రసాదరావు



మాట్లాడుతున్న రాష్ట్ర పూర్వ ప్రధాన కార్యదర్శి పాండురంగ వరప్రసాదరావు

బాపట్ల అర్బన్: పెండింగ్ బకాయిలు విడుదల చేయాలి ఏపీటీఎఫ్ రాష్ట్ర పూర్వ ప్రధాన కార్యదర్శి పి.పాండురంగ వరప్రసాదరావు కోరారు. స్థానిక పెన్షనర్స్ అసోసియేషన్ హాల్‌లో ఏపీటీఎఫ్ బాపట్ల జిల్లా శాఖ కౌన్సిల్ సమావేశం ఆదివారం నిర్వహించారు. సమావేశానికి జిల్లా శాఖ అధ్యక్షులు ఏ శేఖర్ బాబు అధ్యక్షత వహించారు. వరప్రసాదరావు మాట్లాడుతూ ఉద్యోగ, ఉపాధ్యాయులకు పీఆర్‌సీ, కరువు భత్యం పెండింగ్‌లో ఉన్నాయని చెప్పారు. రాష్ట్ర కార్యదర్శి సయ్యద్ చాంద్ బాషా మాట్లాడుతూ జీఓ నంబర్ 117ను రద్దు చేయాలని కోరారు. ఉపాధ్యాయ ప్రధాన సంపాదకులు షేక్ జిలాని మాట్లాడుతూ నాలుగున్నర సంవత్సరాలుగా ఒక ఉపాధ్యాయ పోస్టు కూడా నియామకం జరగకపోవడం దారుణమని, వెంటనే ఖాళీగా ఉన్న 25,000 ఉపాధ్యాయ పోస్టులు భర్తీ చేయాలన్నారు. జిల్లా శాఖ ప్రధాన కార్యదర్శి పీడీ సోషలిజం మాట్లాడుతూ అధికారంలోకి వచ్చిన సీపీఎస్ రద్దు చేస్తానన్న ప్రభుత్వ హామీని నిలుపుకోలేకపోవడం శోచనీయమని ఇప్పటికైనా సీపీఎస్ విధానాన్ని రద్దుచేసి పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలని విన్నవించారు. సమావేశంలో రాష్ట్ర పూర్వ ఉపాధ్యక్షులు వై.నేతాంజనేయ ప్రసాద్, ఐ.విజయ్ సారథి, జిల్లా శాఖ పూర్వ అధ్యక్షులు ఎంసీహెచ్ రాజారత్నం పాల్గొన్నారు.